క్లుప్తంగా

రుణాల పేరిట మోసపోవద్దు

మానవపాడు: లోన్ల పేరిట సైబర్ మోసగాళ్ల బారిన పడొద్దని ఎస్‌ఐ చంద్రకాంత్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచితులకు వివరాలు, డబ్బులు ఇచ్చి మోసపోవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే 1930ను సంప్రదించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోటార్లతో నీటి తొలగింపు



మానవపాడు: మండల కేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే రహదారిలో ఉన్న అండర్ రైల్వే బ్రిడ్జి కింద ఉన్న వర్షపు నీటిని ఆదివారం గ్రామస్తులు మూడు మోటార్లు ఏర్పాటు చేసి తొలగించారు. వరద వచ్చిన ప్రతిసారి అండర్ బ్రిడ్జివద్ద వర్షపు నీరు చేరి నానాఅవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

15న రక్తదాన శిబిరం

అయిజ: పట్టణంలో ఈ నెల 15న నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ డీఎండీ తాహెర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 9 గంటల నుంచి రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని పేర్కొన్నారు.

బోనస్ డబ్బులు చెల్లించాలి



కేటీదొడ్డి: రబీ పంటకు సంబంధించి ధాన్యాన్ని కొనుగోలు చేసిన ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన బోనస్ నేటికీ చెల్లించలేదని బీఆర్‌ఎస్ నాయకుడు గాజుల కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం బోనస్ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వడ్లు అమ్మి 2 నెలలు గడుస్తున్నా బోనస్ జమ చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



ఈడిగ వైష్ణవి(ఫైల్)

ఎర్రవల్లి: చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మురళీ తెలిపిన వివరాలు.. మానవపాడు మండలం పల్లెపాడు గ్రామానికి చెందిన ఈడిగ వైష్ణవి (20) జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతోంది. కుటుంబ సభ్యులు అదే గ్రామానికి చెందిన మేనత్త కుమారుడు(దివ్యాంగుడి)తో మార్చిలో వివాహం చేశారు. ఈ క్రమంలో చదువు పక్కన పెట్టి భర్తతో కలిసి పొలం పనులు చేసుకోవాలని కుటుంబ సభ్యులు పలుమార్లు సర్ది చెప్పడంతో మనస్థాపానికి గురై ఈ నెల 5న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం తెల్లవారుజామున యువతి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తల్లి ఈడిగ సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. వివాహం జరిగి ఐదు నెలలు గడవకముందే ఇలా అర్ధాంతరంగా యువతి మృతి చెందడంతో ఇరు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

మైసమ్మ చెంత జనజాతర



నవాబుపేట: మైసమ్మ దేవత నామస్మరణతో అడవి మొత్తం మార్మోగింది. ఆదివారం మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ దేవాలయంలో జనం తండోపతండాలుగా వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం పైగా ఆషాడమాసం నేపథ్యంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. దీంతో అడవిలో చెట్ల కింద జనం జాతరలా కనిపించారు.

మురుగులో మగ్గుతున్న పీహెచ్‌సీ

- దోమలకు ఆవాసమైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- వర్షం పడిన ప్రతిసారి ఇదే తంతు
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



పీహెచ్‌సీ ఆవరణలో వర్షపునీరు, మురుగు

అయిజ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం చుట్టూ వర్షం కురిసిన ప్రతిసారి వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తోంది. అది కాస్తా మురుగుగా మారి రోగులు, వైద్య సిబ్బంది నానా అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. మురుగు చిన్న సమస్యలా కనిపించినా దోమలు, కీటకాల వృద్ధితో ఇబ్బందులు పడుతున్నారు. రోగులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసే ఆరోగ్య కేంద్రం అనారోగ్యాలకు కేంద్ర బిందువుగా మారుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం రద్దీగా

పీహెచ్‌సీకి ప్రతిరోజు 150 మందికి పైగా అవుట్ పేషెంట్లు వస్తుంటారు. నెలకు 100కు పైగా ప్రసవాలు జరుగుతుంటాయి. 2018లో అయిజ పీహెచ్‌సీలో అత్యధికంగా 547 కాన్పులు చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అయితే పీహెచ్‌సీ చుట్టూ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. మురుగు ప్రజల రోగాల వ్యాప్తికి కారణమవుతోంది. మురుగును తొలగించకుండా ఉండటంతో దానిలో బ్యాక్టీరియా, వైరస్, పరాన్న జీవులు పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.



ఆస్పత్రి ఆవరణలో మురుగులో వెళ్తున్న ప్రజలు

లోపించిన పారిశుద్ధ్యం

ఆస్పత్రి ఆవరణ చుట్టూ పారిశుద్ధ్యం లోపించడంతో పశువులకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఆస్పత్రికి రావాలంటేనే మురుగులోనే రావాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడిన ప్రతిసారి ఇదే తంతని వాపోతున్నారు. ఆస్పత్రి మైదానాన్ని మట్టితో నింపి ఎత్తుగా మార్చి సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలంటున్నారు. అదే విధంగా డ్రెయినేజీలు నిర్మించి మురుగు బయటకు వెళ్లేందుకు కల్వర్టులు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రి ఆవరణలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

దుర్వాసన వెదజల్లుతోంది



ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో వర్షం పడిన ప్రతిసారి వర్షపు నీరు నిలిచి మురుగుగా మారుతోంది. దుర్వాసన వెదజల్లడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దోమల ఉధృతికూడా అధికంగా ఉంది. మురుగు నిల్వకుండా ఆసీసీ బెడ్డు నిర్మించాలి.

- వెంకటన్న, అయిజ

నివేదిక పంపిస్తాం



పీహెచ్‌సీ చుట్టూ మురుగు నిలిచి ఉండడంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిసింది. స్థానిక వైద్యులు అక్కడి సమస్యలను తెలియజేస్తూ, సమస్య పరిష్కారానికి చేయాల్సిన ఏర్పాట్ల గురించి వివరిస్తే ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం.

- సిద్ధప్ప, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ

వంతెన నిర్మించండి సారూ..



వంతెన నిర్మించాలని కోరుతున్న యువకులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలం జూలెకల్ వాగుపై వంతెన నిర్మించి ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. దశాబ్దాల కాలంగా వర్షాకాలంలో వాగు పొంగి పొర్లుతూ రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2009 వరదల సమయంలో వారం రోజుల పాటు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయినట్లు తెలిపారు. వంతెన నిర్మిస్తామని నాయకులు, అధికారుల ఇచ్చిన హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షం కురిస్తే రాకపోకలు నిలిచిపోయి ఇబ్బందులకు గురవుతున్నామని, అత్యవసర సేవలు అందడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి జూలెకల్ వాగుపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

అన్నదాతలకు అపార నష్టం



శాంతినగర్ మండలం పైపాడు శివారులో నీట మునిగిన పత్తి చేను

శాంతినగర్: నెల రోజులుగా వర్షాల లేక అవస్థలు పడిన రైతులు వర్షాల కోసం మండల పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తీరా గడిచిన రెండు రోజుల్లో వర్షాలు పడిన నేపథ్యంలో సంతోషంచాలో వాగులు వంకల సమీపంలో ఉన్న పంటలు నష్టపోయి బాధపడాలో తెలియని పరిస్థితులు నెలకొన్నాయని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్, జిల్లెడుదిన్నె, కోయిల్‌దిన్నె, పైపాడు గ్రామాల సమీపంలో పారుతున్న పెద్దవాగు భారీ వర్షాలకు పొంగిపొర్లి ప్రవహించింది. దీంతో వాగు సమీపంలో సాగు చేసిన పత్తి, కంది, కొర్ర పంటలు సుమారు వంద ఎకరాల వరకు నీట మునిగాయి. పూత, పిందె దశకు వచ్చిన పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఈ విషయమై మండల వ్యవసాయశాఖ అధికారులు స్పందించి నీట మునిగిన పంటలను పరిశీలించి నష్టపరిహారం అందేలా చూడాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

నీట మునిగిన పంటలు

ఎర్రవల్లి: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలో షేకుపల్లి, సాసనూలు, గార్లపాడు, తదితర గ్రామాల సమీపంలోని పలు వాగులు ఆదివారం ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆయా గ్రామాల్లో సాగుచేసిన పత్తి, మిరప, వరి పంటల్లో వర్షపునీరు అధికంగా చేరడంతో తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



ఎర్రవల్లి మండలం షేకుపల్లిలో ప్రవహిస్తున్న వాగును దాటుతున్న ప్రజలు



షేకుపల్లిలో పత్తి పంటలోకి చేరిన వర్షపు నీరు

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి



చాంపియన్‌షిప్ ప్రారంభిస్తున్న ఎస్పీ వెంకటేష్

మహబూబ్‌నగర్ క్రీడలు: ఆత్మరక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఫౌండర్ కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం 4వ జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు పలు జిల్లాలకు చెందిన దాదాపు 150కి పైగా కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. కుమితే, కతాస్, లాంగ్‌వెపన్, షార్ట్ వెపన్, టీమ్ కతాస్ పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పతకాలు సాధించారు. కరాటే చాంపియన్‌షిప్‌ను ఎస్పీ వెంకటేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఫిజికల్ ఫిట్‌నెస్‌గా ఉండాలని కోరారు. కరాటే మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభచాటాలని సూచించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ జిల్లా విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి కరాటే టోర్నీలో రాణించాలని కోరారు. జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ నిర్వహించిన శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఫౌండర్ వెంకటేశ్‌ను అభినందించారు. ఆయా విభాగాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్, సురేష్‌చందర్, జిల్లా బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తికి గాయాలు



రాజోళి: మండల కేంద్రంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం రాత్రి కుర్వ రంగస్వామి అనే వ్యక్తి పొలం పని ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న సమయంలో పంప్‌హౌస్ వద్ద గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ప్రమాదంలో రంగస్వామి తీవ్ర గాయపడ్డాడు. స్థానికులు సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డైవర్షన్ రోడ్డుకు మరమ్మతు

అయిజ: పట్టణ సమీపంలోని మేడికొండ రోడ్డులో పోలోని వాగుపై నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి పక్కన ఉన్న డైవర్షన్ రోడ్డు శనివారం కురిసిన వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆదివారం డైవర్షన్ రోడ్డుకు ఎస్‌ఐ శ్రీనివాసరావు సొంత ఖర్చులతో దగ్గరుండి మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా మండల ప్రజలు ఎస్‌ఐకు అభినందనలు తెలియజేశారు.

మభ్యపెట్టడానికే జనహిత పాదయాత్ర



మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

అయిజ: ప్రజలను మభ్యపెట్టడానికే కాంగ్రెస్ ప్రభుత్వం జనహిత పాదయాత్ర చేస్తుందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంతో పోరాడి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధిస్తామని చెప్పిన మాట ఏమైందని ప్రశ్నించారు. స్థానిక ఎన్నికల్లో ఓట్లు రావని ముందస్తు ప్రణాళికతో పాదయాత్ర చేపట్టారని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చి ఉంటే పాదయాత్రకు వెళ్లాల్సిన అవసరం ఏముందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శశివర్మతేజ, ఉపాధ్యక్షుడు మణికుమార్, కోశాధికారి సవారన్న, దాసు, శివన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జెండా ఎగురవేద్దాం



తిరంగా ర్యాలీలో రామచంద్రారెడ్డి

మానవపాడు: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేద్దామని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని అమరవాయి నుంచి మండల కేంద్రం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భద్రత విషయంలో సైనికులు రాజీలేని పోరాటం చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటిపై ఈ నెల 13, 14, 15వ తేదీల్లో జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌శర్మ, సీనియర్ నాయకులు తిమ్మప్ప, రామాంజనేయులు, మదన్‌మోహన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన కల్వర్టుతో ప్రమాదం



ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టు

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే దారిలో డ్రెయినేజీపై నిర్మించిన కల్వర్టు కూలింది. ప్రతి నిత్యం ఈ దారి గుండా వందల మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్తుంటారు. కూలిన కల్వర్టులో చిన్నారులు ప్రమాద బారిన పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టుకు మరమ్మతు చేయకుండా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



పూజలు చేస్తున్న అర్చకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని పరిమళగిరిపై వెలిసిన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో 354వ ఆరాధనోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పూర్వారాధన వేడుకలు వైభవంగా జరిగాయి. అత్యంత భక్తిశ్రద్ధల మధ్య వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, పాదపూజ, కనకాభిషేకం, వివిధ రకాల ఫలాలతో కూడిన ఫలపంచామృతాభిషేకం చేశారు. అర్చకులు స్వామి వారి బృందావనానికి అభిషేకం చేశారు. అష్టోత్తర పారాయణం, తులసీ అర్చన, నైవేద్యం, అనంతరం స్వామివారిని సుగంధ పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం స్వామివారిని మఠం ప్రాంగణంలో ఊరేగించారు.



స్వామివారిని దర్శించుకొంటున్న ఎంపీ డీకే అరుణ

ఆరాధన ఉత్సవాల్లో ఎంపీ డీకే అరుణ

శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాల్లో ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు. అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆమె మాట్లాడుతూ రాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధి కోసం నావంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మధ్యారాధన పూజలు

ఆరాధన ఉత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యారాధన వేడుకలు నిర్వహించనున్నారు. స్వామివారికి క్షీరాభిషేకం, ఫలపంచామృతాభిషేకం, సుగంధ పుష్పాలతో అలంకారణ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అడ్డంకులు తొలగేనా..?

- అర్హత ఉన్నా అందని 'గృహజ్యోతి'
- పెండింగ్ బిల్లుల చెల్లింపుపై వివాదం
- బిల్లులు చెల్లించమంటున్న లబ్ధిదారులు



గద్వాలలో విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్న ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి (ఫైల్)

అయిజ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను గతేడాది నుంచి అమలు చేస్తోంది. ఈ పథకం కింద అర్హత ఉన్న గృహాలకు 2024 సంవత్సరం మార్చి నెల నుంచి అమల్లోకి వచ్చింది. జిల్లాలో మొత్తం విద్యుత్ వినియోగదారులు 1,55,918 మంది ఉండగా గృహజ్యోతికి 85,866 మంది దరఖాస్తు చేసుకున్నారు. 62,733 నివాస గృహాలకు గృహజ్యోతి పథకానికి అర్హత లభించింది. అయితే 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను ఖర్చు చేస్తున్నా సరే చాలా నివాస గృహాల యజమానులు గృహజ్యోతి పథకానికి నోచుకోవడం లేదు. కొన్ని నెలల తర్వాత కొంత మందిని అర్హులుగా ప్రకటించారు. జీరో బిల్లులు వచ్చే వరకు ఉన్న బకాయిలను చెల్లించాలని అధికారులు వినియోగదారులపై ఒత్తిడి తెస్తుండగా.. నిబంధనల మేరకు బిల్లు చెల్లించమని వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

లబ్ధిదారుల అసంతృప్తి

గృహజ్యోతి పథకం ప్రకటించినప్పటి నుంచి చాలా మంది లబ్ధిదారులకు జీరో బిల్లు రావడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. కొందరు వినియోగదారులు 200 యూనిట్ల లోపే విద్యుత్ వాడినప్పటికీ సాధారణ బిల్లులు వస్తున్నాయని, ఇందులో ఉచిత విద్యుత్ సౌకర్యం గురించి ఎలాంటి ప్రస్తావన లేదని, జీరో బిల్లులు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాత బకాయిలపై ఒత్తిడి..

గృహజ్యోతి పథకం కింద జీరో బిల్ వచ్చిన వినియోగదారులు, పాతబకాయిలు చెల్లించాల్సిందేనని విద్యుత్ శాఖ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

గృహజ్యోతి లబ్ధిదారుల వివరాలు

మొత్తం విద్యుత్ వినియోగదారుల సంఖ్య 1,55,918	గృహజ్యోతికి వచ్చిన దరఖాస్తుల సంఖ్య 85,866
బకాయిలు ఉన్నవారి వారి సంఖ్య 43,809	మొత్తం బకాయిలు రూ. 6.28 కోట్లు
బకాయిలు చెల్లించిన వారి సంఖ్య 18,924	చెల్లించిన బకాయిలు రూ.2.66 కోట్లు
ఇంకా బకాయిలు చెల్లించినవారి సంఖ్య 24,885	చెల్లించాల్సిన బకాయిలు మొత్తం రూ. 3.62 కోట్లు

పాత బకాయిలు చెల్లించవద్దని ప్రభుత్వం నుంచి మాకు ఆదేశాలు రాలేదని, బకాయిలు తప్పకుండా చెల్లించాలని విద్యుత్ అధికారులు గట్టిగా చెబుతున్నారు. బకాయిలు చెల్లించనివారి నివాస గృహాలకు విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేస్తున్నారు.

మార్గదర్శకాలు ఇవ్వండి



ఉచిత విద్యుత్ పథకం అమలు, బకాయిల చెల్లింపు విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలి. బిల్లింగ్ వ్యవస్థను ఆధునీకరించి జీరో బిల్ జారీలో లోపాలను సవరించాలి.

- నాగరాజు, అయిజ

ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేవు



గృహజ్యోతి పథకంకు దరఖాస్తు చేసుకొని 2024 మార్చి నుంచి 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను ఖర్చు చేసిన వారు బిల్లులు చెల్లించమని అంటున్నారు. అలా వసూలు చేయవద్దని ప్రభుత్వం నుంచి విద్యుత్ శాఖకు ఆదేశాలు రాలేదు.

- ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి

సాంకేతిక సమస్యలు

గృహజ్యోతి పథకం అమలుకు సంబంధించి సాంకేతిక సమస్యలు కూడా ఒక అడ్డంకిగా ఉన్నాయి. విద్యుత్ బిల్లింగ్ వ్యవస్థలో పథకాన్ని సమగ్రంగా అమలు చేయడానికి అవసరమైన సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లు, డేటాబేస్ నిర్వహణలో లోపాలు ఉన్నట్లు తెలుస్తోంది. అదనంగా ఈ పథకం గురించి లబ్ధిదారులకు సరైన అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా చాలామంది ఈ పథకం కింద ఎలా దరఖాస్తు చేయాలి. ఏ పత్రాలు సమర్పించాలి అనే విషయంలో సందిగ్ధంలో ఉన్నారు.